పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర-బొబ్బిలి : నియోజకవర్గ ఎమ్మెల్యే బేబినాయన ఆదేశాలతో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు పురపాలక సంఘ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమానికి శంకుస్థాపన చేశారుముందుగా ఆ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కె లక్ష్మి దంపతులు మరియు వార్డు పెద్దలు అందరూ కలిసి సదరు అభివృద్ధి పని శంకుస్థాపనకు హాజరైన మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు ని దుశ్శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. 25 వ వార్డు - ద్వారకానగర్ యందు పల్లి అప్పలనాయుడు ఇంటి నుండి జి. అప్పారావు ఇంటి వరకు ఈసీ రోడ్డు నిర్మాణం చేయుటకుఅంచనా వ్యయం. 7:00లక్షలతో శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు మాట్లాడుతూ శంఖుస్థాపన చేసిన పని ని వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు మరియు సంబంధిత కాంట్రాక్టరు వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్ ,మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ కు మండల, మున్సిపల్ స్థాయి అధికారులుహాజరు కావాల్సిందే

కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : జిల్లాలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్(పి జి ఆర్ ఎస్) కార్యక్రమంకు జిల్లా అధికారులతో పాటు మండల, మున్సిపల్ స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లేదా జూమ్ లింక్ ద్వారా తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి స్పష్టం చేసారు. సోమవారం కలెక్టరెట్ సమావేశ మందిరం లో నిర్వహించిన మీకోసం కార్యక్రమం లో కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో మరింత సమర్థత, పారదర్శకత చూపాలని సూచించారు. ఫిర్యాదుల రి ఓపెనింగ్ ఎక్కువగా ఉన్నాయని, రెండు వారాలలో ఫిర్యాదుల రీ-ఓపెనింగ్ శాతం గణనీయంగా తగ్గేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదు దారుడికి సక్రమమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వడం, అందులో సంబంధిత రూల్ పొజిషన్ స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరన్నారు. ఎండార్స్‌మెంట్లు నిర్లక్ష్యంగా ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజుకు కనీసం 60 కాల్స్ చేసి ఫిర్యాదుదారుల నుండి ఫీడ్బ్యాక్ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రీ ఆడిట్, ఆడిట్ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించాలన్నారు. అధికారులు తమ పనితీరులో బిహేవియర్ లాప్సెస్, ప్రొసీజరల్ లాప్సెస్ వంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, విధి నియమాల ప్రకారం వ్యవహరించాలని సూచించారు.

ఈవారం 184 ఫిర్యాదులు

ఈవారం రెవెన్యూ కు సంబంధించి 69 ఫిర్యాదులు రాగా, డిఆర్డిఏ కి సంబంధించి 28, డిపిఓ కు సంబంధించి 13, మున్సిపాలిటీలకు సంబంధించి 13, జీఎస్డబ్ల్యూఎస్ 21, ఇతర శాఖలతో కలిపి 184 ఫిర్యాదులు అందాయి.ఈ పిజిఆర్ఎస్ లో డిఆర్ఓ ఎస్. శ్రీనివాసమూర్తి, ప్రత్యేక ఉపకలెక్టర్లు మురళి, వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ, రాజేశ్వరి, కళావతి ఫిర్యాదుల స్వీకరించిన వారిలో ఉన్నారు. జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడూరు గ్రామసభ లో ప్రజాసమస్యపై చర్చ

విశాలాంధ్ర-గరివిడి: మండలంలోని కోడూరు గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ కార్యదర్శి పి. త్రినాధరావు ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సమావేశంలో గ్రామ ప్రజల సమస్యలు చర్చకు వచ్చాయి. గ్రామ మాజీ సర్పంచ్ అడపా సూర్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనాలు చాలా ఆలస్యంగా వస్తున్నాయని, అలాగే వంద రోజుల ఉపాధి పనులు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదని, రిక్షా కాలనీ అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణం సగంలోనే ఆగిపోయిందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను వేడుకున్నారు.గ్రామ ఎంపీటీసీ సన్యాసి మాట్లాడుతూ, గ్రామసభలకు సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం సరికాదని ప్రశ్నించారు. దీనికి స్పందించిన కార్యదర్శి త్రినాధరావు భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగవని తెలిపారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గేదెల ఆదినారాయణ, ఉపసర్పంచ్ శంకర్, మాజీ ఎంపీటీసీ, గ్రామ టిడిపి నాయకులు ఎలకల ఎంకినాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణ సాధకుడు

రైతు బాంధవుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు

గొర్రిపాటి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గంట్యాడ: గంట్యాడ మండలం తాటిపూడి స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ జిల్లా బోర్డు మాజీ అధ్యక్షుడు, తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణ సాధకుడు, రైతు బాంధవుడు గౌరవ కీర్తిశేషులు శ్రీ గొర్రిపాటి బుచ్చిఅప్పారావు 112వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ సోమవారం ఘనంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర మధ్య చిన్న తరహా పరిశ్రమల ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా నిర్వహించడం జరిగినది.మదనాపురం మోడల్ స్కూల్ సమీపంలోని తాటిపూడి, గొర్రిపాటి బుచ్చిఅప్పారావు రిజర్వాయర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “గొర్రిపాటి బుచ్చిఅప్పారావు స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే కాకుండా, ప్రజాసేవకుడిగా, రైతు హితభుజంగుడిగా ఆంధ్ర చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించారు. ఆయన ఆత్మత్యాగం, సేవా స్ఫూర్తి ఈ తరం యువతకు ఆదర్శం కావాలి” అని పేర్కొన్నారు. కొంతమంది పెద్దలు అభిమానులు అభ్యర్థన మేరకు అసెంబ్లీలో చర్చించి 15 రోజులలో జీవో తీసుకుని వచ్చామని మంత్రి చెప్పారు. విగ్రహావిష్కరణకు ఒక కమిటీని ఏర్పాటు చేసి నెల రోజులలో విగ్రహావిష్కరణ చేయడం జరిగిందని అన్నారు. తాగునీరు సాగునీరు ఇచ్చే ఘనత గొర్రెపాటి బుచ్చప్పరావు దేనిని చెప్పారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి. కోళ్ల లలిత కుమారి ఆర్ వి ఎస్ ఎస్ కే రంగారావు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ రైతుల సమస్యలను గుర్తించి ప్రాజెక్టు తీసుకురావాలని ఆలోచన ఆయనకు రావడం గర్వించదగ్గ విషయమని ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు ఎంతో అదృష్టవంతులని ఇటువంటి మహానుభావులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని గోరిపాటి బుచ్చి అప్పారావు మహనీయుడు మానవతా వాదని ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తర ఆంధ్ర మూడు జిల్లాలనుంచి వెలమ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా, ఉత్సాహంగా సాగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, గ్రామ పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు బుచ్చిఅప్పారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పి వీఎస్ మాధవ్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని మార్కెట్ కమిటీ చైర్మన్ కరోతు బంగారు రాజు డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ గజపతినగరం జనసేన అధ్యక్షులు మర్రాపు సురేష్ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు తాటిపూడి ప్రాజెక్ట్ చైర్మన్ కళ్యంపూడి జగన్నాథరావు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రంది అర్జున మహేష్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లు విజయ్ కుమార్ రంది రాము నాయుడు, చిన్న రామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారా రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ

విశాలాంధ్ర -విజయనగరం రూరల్ : పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏలూరు వేదికగా నిర్వహించిన 7వ రాష్ట్ర పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ - 2025 పోటీల్లో జిల్లాకు చెందిన పారా స్విమ్మర్స్ ప్రతిభ కనుపరిచారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తెలిపారు. ఏలూరు లోని బిశ్వనాథ్ భర్తీయ ఈత కొలనులో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ మెన్ విభాగంకు (ఎస్ 8) సంభందించి జాగరణ సత్యనారాయణ 50 మీటర్లు బెస్ట్ స్ట్రోక్ పోటీల్లో సిల్వర్ మెడల్, 50 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా, సబ్ జూనియర్ ఉమెన్స్ విభాగంకు (ఎస్ 13) సంభందించి ప్రియాంకదాస్, మౌనిక లు 50 మీటర్లు ఫ్రీ స్టైల్ పోటీల్లో సిల్వర్ మెడల్స్ సాధించారు. విజేతలను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషద్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి లు అభినందనలు తెలియజేసారు.

జేఎన్‌టియు గురజాడ కొత్త వీసీగా ప్రొఫెసర్ వెంకట సుబ్బారావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ గురజాడ, నూతన వైస్ చాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ వి. వెంకట సుబ్బారావు సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ గురజాడ అప్పారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జేఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయ నూతన వైస్ చాన్సలర్‌గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అనుబంధ కళాశాలల ప్రతినిధులు, విద్యావేత్తలు, స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అందరూ ప్రొఫెసర్ సుబ్బారావు గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రొఫెసర్ సుబ్బారావు విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాలను అభివృద్ధి చేయడం, మౌలిక సదుపాయాలు, విద్యార్థి సౌకర్యాలను మెరుగు పరచడం పట్ల తన కట్టుబాటును వ్యక్తం చేశారు. జేఎన్‌టియు-జీవి సమగ్ర అభివృద్ధిదిశగా విశ్వవిద్యా ప్రగతికి కృషి చేయాలనే సంకల్పాన్ని ఆయన తెలిపారు.

అనుమానంతో హత్య ...!

- మృతుడి తల్లిదండ్రుల ఆరోపణ
- పోలీస్‌స్టేషన్ వద్ద విలపిస్తున్న బాధితులు.....

విశాలాంధ్ర-చీపురుపల్లి: తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో తన కుమారుడు ఎలకల రాము(26)ను యజమాని వండాన సన్యాసిరావు హత్య చేశాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రులు ఎలకల రమేష్ తులసి, బంధువులు, గ్రామస్తులు సోమవారం చీపురుపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 9న పత్తికాయవలస సమీపంలోని నేలబావి లో శవమై తేలిన ఎలకల రాము వెనుక జరిగిన హత్య కథనాన్ని కుటుంబస్తులు వివరించారు. పత్తికాయవలస గ్రామానికి చెందిన రాము గత నాలుగేళ్లుగా సన్యాసిరావు వద్ద ప్రొక్లైన్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. అంతేకాక సన్యాసిరావు కుటుంబంతో సాన్నిహిత్యంగా ఉండేవాడు. ఈనెల 8న యధావిధిగా పనికివెళ్ళాడని, రోజు సాయంత్రం ఇంటికి చేరుకునే తమ కుమారుడు రాకపోవడంతో యజమానిని తండ్రి వాకాబు చేశాడు. అడిగాడు. తాను కలక్షన్ నిమిత్తం బాతువ వెళ్లానని రాము పనిముగించుకొని ఇంటికి వచ్చేస్తాడంటూ రకరకాల కథనాలు రెండు రోజులు పాటు చెప్పాడు. కనిపించని రాముకోసం తమతోపాటే వెతుకులాట ప్రారంభించి నాటకం ఆడారని వారు ఆరోపించారు. వాస్తవంగా బుధవారం సన్యాసిరావు ఊర్లోనే ఉండి పథకం ప్రకారం హత్యకు రూపకల్పన చేశారు. మరుసటి రోజున చీపురుపల్లి వెంకటాపురం లావేరు రణస్థలం తదితర ప్రాంతాల్లో వెతుకులాట ప్రారంభించామన్నారు. తాను పనిచేస్తున్న ఇటుక బట్టీల సమీపంలో గల నేలబావివైపు తమను వెల్లనివ్వకుండా సన్యాసిరావు కట్టుకథల అల్లి తమను పక్కతోవ పట్టించాడని ఈ సందర్భంగా బాధితులు వివరించారు. తన వద్ద నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ జీతాలు సరిగా ఇచ్చేవాడు కాదని, జీతాల కోసం నిలదీస్తే ఇటీవల నాలుగైదు సార్లు చేయి చేసుకున్నాడని అన్నారు. అంతేకాక ఇతర ప్రాంతాల్లో గల తమ బంధువులు వద్ద కూడా రాముని ఎప్పటికైనా తాను చంపి తీరుతానంటూ హెచ్చరికలు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతోనే పథకం ప్రకారం రాముని చంపి నేలబావిలో పడేసారని మృతిని తల్లిదండ్రులు బోరున విలపిస్తూ ఆరోపించారు. మృతుడు రాము మంచి ఈతగాడని అటువంటి వ్యక్తి ఎలా మరణిస్తాడంటూ వారు అనుమానం వ్యక్తం చేశారు. పథకం ప్రకారం జరిపిన హత్య పైన పోలీస్ ఉన్నతాధికారులు నిగూఢమైన దర్యాప్తు జరిపి హత్యకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ అధికారులను కోరారు. కొడుకు కుటుంబ పోషణపై ఆధారపడి బ్రతుకుతున్న తమకు పెద్దదిక్కు కోల్పోయమంటూ బాధితులు బోరును విలపించారు. పోలీస్ అధికారులు బాధితుల ఫిర్యాదు మేరకు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు చీపురుపల్లి పోలీస్ స్టేషన్కు ఫిర్యాదును అందజేశారు.

శ్రీమన్నార్ రాజగోపాల్ స్వామి దేవాలయ నూతన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా మాడిమి దేవేంద్రనాథ్ నియామకం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విజయనగరంలో ప్రముఖ దేవాలయమైన శ్రీమన్నార్ రాజగోపాల్ స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా మాడిమి దేవేంద్రనాథ్‌తోపాటు ఎనిమిది మందిని ట్రస్ట్ సభ్యులుగా నియమించింది ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో త్వరలోనే ప్రమాణ స్వీకారం చేస్తామని శ్రీ మన్నార్ రాజగోపాల్ స్వామి వారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మాడిమి దేవేంద్రనాథ్ తెలిపారు.

సత్య కళాశాలలో ఎన్‌సిసి బాలుర విభాగం ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక తోటపాలెం పరిధిలో గల సత్య డిగ్రీ , పీజీ కళాశాల బాలుర ఎన్ సి సి విభాగం ఎంపిక ప్రక్రియ ను అయోధ్య మైదానంలో 13(ఎ) బాయ్స్ బేటాలియన్, విశాఖ పట్నం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నీరజ్ కుమార్, సుబేదార్ దేవేందర్ సింగ్, హవల్దార్ ఆనంద్ సింగ్, హవల్దార్ రామ్ ప్రసాద్, హవల్దార్ కులదీప్‌కాల,జిసిఎల్ దివ్య దుర్గా ఆధ్వర్యంలో నిర్వహించారు.ఎంపిక ప్రక్రియలో. భాగంగా అభ్యర్థులను 1600 మీటర్ల పరుగు, సిటప్ లు, పుష్ అప్ లు, 100 మీటర్ల స్ప్రింట్, ఎత్తు, బరువు, కంటి చూపు వంటివి పరీక్షించి వ్యక్తిగత ఇంటర్వ్యూ ను నిర్వహించారు.మొత్తం 100 మంది సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. మజ్జి శశిభూషణరావు, ఎన్‌సిసి అధికారులు, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్‌కిరణ్, యన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.ఈ ఎంపిక శిబిరం ద్వారా విద్యార్థుల శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఇంటింటి సర్వే పూర్తిచేసి ఇంటి పన్నులు వేయండి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర - బొబ్బిలి: పురపాలక సంఘ కార్యాలయంలో రెవిన్యూ విభాగపు సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూప్రభుత్వం వారి మార్గ నిర్దేశకాలనీ అనుసరించి పురపాలక సంఘాలకు ఆర్థిక పురోగతి చేకూర్చుటలో భాగంగా పట్టణ పరిధిలో గల అసెస్మెంట్లకు వందశాతం ఇంటింటి సర్వే చేయించి, కొత్తగా ఇంటి పన్నులు వేయుట మరియు ఇదివరకే ఉన్నటువంటి అసెస్మెంట్లను అడిషనల్ ఆల్టరేషన్ చేయుట తదితర అంశాలకు సంబంధించి జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరితగతిన పూర్తిచేసి పన్నులు విధించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అన్ని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ విభాగపు సిబ్బంది, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మరియు రెవెన్యూ ఆఫీసర్ పాల్గొన్నారు.

విశాఖకు గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మైలురాయి : కర్రోతు

విశాలాంధ్ర-భోగాపురం : ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ టెక్నాలజీ సంస్థ విశాఖపట్నంకు రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు ఎంతో శుభపరిణామమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు పేర్కొన్నారు. పోలిపల్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను తీసుకువచ్చి హైదరాబాద్‌ను టెక్ హబ్‌గా మార్చిన విధంగానే, ఇప్పుడు విశాఖలో గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారనున్నదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్రానికి ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అమరావతికి క్వాంటం వ్యాలీని తీసుకువచ్చి, నేడు విశాఖకు గూగుల్‌ను తీసుకురావడం ౦ ఇది ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సంకేతం అని అన్నారు. గత 16 నెలల్లో రాష్ట్రం 11.20 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, దాదాపు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు సృష్టించబడ్డాయని వివరించారు. గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పిడుగు తోటరావు,పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామి రెడ్డి,ఎంపీటీసీ పిడుగు వెంకటసత్యం,ఏఎంసీ డైరెక్టర్ గరి వెంకటరమణ,మండల పార్టీ ఉపాధ్యక్షుడు కోలా రామసూరి,తెలుగు యువత మండల అధ్యక్షుడు మౌళి వర్మరైతు అధ్యక్షుడు రీసు రమణ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ మంత్రినాదెండ్ల మనోహర్ కలిసిన జనసేన నాయకులు అవనాపు విక్రమ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ని సోమవారం జిల్లా జనసేన పార్టీ నాయకులు అవనాపు విక్రమ్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లాలోని జనసేన పార్టీని బలోపేతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. మంత్రి మనోహర్ ని కలిసిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గ జనసేన నాయకులు జరజాపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం అరికట్టాలని వైసీపీ మహిళా విభాగం ఆందోళన

విశాలాంధ్ర -శృంగవరపుకోట: వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ మహిళా విభాగ నాయకులు, కార్యకర్తలు ఎక్సైజ్ స్టేషన్ వద్ద కల్తీ మద్యం వ్యాపారాలపై సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కల్తీ మద్యం విక్రయాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల మద్దతుతో శృంగవరపుకోట నియోజకవర్గంలో మద్యం దుకాణ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. వెంటనే సంబంధిత అధికారులు మద్యం షాపులను తనిఖీ చేసి, కల్తీ మద్యం రవాణా మరియు విక్రయాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని కోరారు. గ్రామాలంతా పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. తరువాత మహిళా విభాగ ప్రతినిధులు శృంగవరపుకోట ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు కల్తీ మద్యం, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా విభాగ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్యాయంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను

విధుల్లోకి కొనసాగించకపోతే పోరాటం తప్పదు



ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకుంటూ ప్రభుత్వ వైద్య అధికారులుగా విధులు నిర్వహించవచ్చా ?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం/నెల్లిమర్ల/విజయనగరం టౌన్: నెల్లిమర్ల సి.హెచ్.సి సూపరింటెండెంట్ తిరుమల దేవి ఉదయం 9 గంటలకి విధులకిహాజరుకాకపోయిన ప్రభుత్వ నిబంధనలు వర్తించవా, ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకుంటూ ప్రభుత్వ వైద్య అధికారులుగా విధులు నిర్వహించవచ్చా అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం నెల్లిమర్ల సి.హెచ్.సి దగ్గర ఆంధ్రపదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో జరిగిన నిరసన ధర్నాలో హాజరైన ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ నెల్లిమర్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సి.హెచ్ సి) లో 20 ఏళ్ళుగా పని చేస్తున్న బడుగు పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులను హాస్పిటల్ సూపరింటెండెంట్ తిరుమల దేవి బకాయి ఉన్న 2 నెలల జీతాలు, పి.ఎఫ్ డబ్బులు కాంట్రాక్టర్ల చేత ఇప్పించమని, ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం పెరిగిన జీతాలు పూర్తిగా ప్రతి నెల 10 వ తేదిలోపు ఇప్పించి, సెలవులు మంజూరుచేయమని, హాస్పిటల్ లో ఓ.పి లు పెరుగుతుండటం వల్ల ముగ్గురు కార్మికులు చేస్తున్న పనిని ఒక్కరితో చేయించడం వలన అనారోగ్యం పాలవుతున్నాం కాబట్టి వర్కర్ల సంఖ్య పెంచి పని ఒత్తిడి తగ్గించమని కోరితే ఆ విషయాలు మాకు సంబంధం లేదని చెప్పడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపి పై అధికారులకి వినతిపత్రాలు ఇస్తున్నారని కార్మికులపై నిర్దాక్షిణ్యంగా ఉద్దేశ్యపూర్వకంగా ఇద్దరు కార్మికులను తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇదేమి అన్యాయమని అడిగితే దూరంగా వేరే ఊర్లుకి బదిలీలు చేస్తాను నచ్చితే బదిలీ చేసిన చోటుకి వెళ్లండి లేకపోతే మానేయండి అని కార్మికులను విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయండి అని అడిగితే కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడతార అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల చేత జీతాలు ఇప్పించడంలో చూపని శ్రద్ధ స్థానిక ఎమ్మెల్యేపై, ఎమ్మెల్యే పి.ఏ పై ఒత్తిడి చేసి కార్మికులను తొలగింపులు, బదిలీలు పై ఎందుకు అంత శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. హాస్పిటల్ లో మౌలిక వసతులు లేవని, వర్షం పడితే హాస్పిటల్ లో వర్షం నీరు కారి, మంచాలు, వార్డులు పూర్తిస్థాయిలో లేవన్నారు, కనీస మౌలిక వసతులు లేకపోయినా వాటి దృష్టి పెట్టకుండా కాయకష్టం చేసుకుని చాలీచాలని వేతనాలతో బతుకు జీవుడా అని పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వేధింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. ప్రజా ధనాన్ని జీతాలుగా తీసుకుంటూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సమయానికి ఆసుపత్రి విధులకు హాజరు కాకపోయినా ఎలాంటి చర్యలు తీసుకోరు కానీ కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయమని అడిగితే వారి పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకుంటూ ప్రభుత్వ వైద్యులుగా, అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను కొనసాగించాలని, జీతాలు పూర్తిగా చెల్లించాలని మొదలైన సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నెల్లిమర్ల మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులు మొయిద పాపారావు హాజరై సంఘీభావం తెలిపారు. శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ లు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు సన్నద్ధం

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్నాయని మండల విద్యాశాఖా అధికారి రమణ మూర్తి తెలిపారు . విద్యా కమిషనర్, డీఈఓ ఆదేశాల మేరకు అండర్-14 మరియు అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, యోగా, షటిల్ మొదలైన క్రీడలు నిర్వహించబడతాయి.మండల విద్యా అధికారి ఆధ్వర్యంలో, ఈ పోటీలు భోగాపురం పరిధిలోని పలు పాఠశాలల్లో జరగనున్నాయని తెలియజేశారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.అన్ని పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు సోమవారం మండల వనరుల కేంద్రం లో సమావేశమై టోర్నమెంట్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశానికి సంబంధిత మండల విద్యా అధికారి అధ్యక్షత వహించారు.

కల్తీ మద్యంతో కూటమి కుదేలు తథ్యం....

-నకిలీ మద్యంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట

విశాలాంధ్ర-చీపురుపల్లి : రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తూ వేలాదిమంది ఆడపడుచుల తాళిబొట్టులతో ఆడుకుంటున్న కూటమి ప్రభుత్వం కుదేలు కావడం తథ్యమని చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు మహిళా సర్పంచులు ఎంపీటీసీలు ఎంపీపీలు, శాపనార్థాలు పెట్టారు. సోమవారం నాడు.చీపురుపల్లి నియోజకవర్గం కేంద్రం లో వైస్సార్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు చీపురుపల్లి పంచాయతీ ఆఫీస్ వద్దనున్న అంబేద్కర్ బొమ్మ నుంచి ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ ఆఫీస్ వరకు వైస్సార్ పార్టీ నియోజకవర్గం లో నాలుగు మండలాల నాయకులు పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యన్నారాయణ, రాజాం నియోజకవర్గం పరిశీలకులు కె.వి సూర్యనారాయణ రాజు,ఎంపీపీ లు పొట్నూరు ప్రమీల, ఇప్పిలి వెంకట నరసమ్మ,జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సీర అప్పలనాయుడు,ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు

ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని మెయిన్ రోడ్డు, మూడు రోడ్లు జంక్షన్ మీదుగా ఎక్సైజ్ ఆఫీస్ వరకు ర్యాలీ గా వెళ్లి ప్రొహిబిషన్ సీఐ సిహెచ్ చక్రవర్తి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియతో మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమలా మార్చి, రాష్ట్రమంతా సరఫరా చేస్తూ, ప్రజల ప్రాణాలు హరిస్తున్న అధికార తెలుగుదేశం పార్టీ ఆడపడుచులు తాళిబొట్లతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టుషాప్‌ల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి, దీని వెనక ఎంత పెద్ద వారున్నా అరెస్టు చేయాలని అని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి,కరిమజ్జి శ్రీనివాసరావు,ధన్నాన జనార్ధన్,గుర్ల నాయకులు ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జడ్పీటీసీ సీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారినాయుడు,స్వామినాయుడు, గరివిడి నాయకులు,బమ్మిడి కార్తీక్, ముళ్ళు రాంబాబు, వలిరెడ్డి లక్ష్మణరావు,రఘుమండ శ్రీదేవి, గవిడి సురేష్, ఇప్పిలి గోవింద, కోరుకొండ దాలయ్య, ముళ్ళు పైడిరాజు,కర్రోతు ప్రసాద్,గిరిడి రామదాసు, వార్డ్ మెంబెర్స్ రౌతు పైడిరాజు, సూరు దుర్గారావు, అంబటి లోకేష్, సింహాచలం,కంచుపల్లి అశోక్, అఖిల్ పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన పెంచుకోవాలి

-జాయింట్ కమిషనర్ నిర్మలాజ్యోతి
-పట్టణంలో మోటార్‌సైకిల్ ర్యాలీ
-పెద్దఎత్తున చైతన్య కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయనగరం: తగ్గించిన జిఎస్‌టి శ్లాబులపై ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ జి.నిర్మలాజ్యోతి కోరారు. అన్నివర్గాలకు మేలు చేసేలా జిఎస్‌టి శ్లాబులను నాలుగు నుంచి రెండుకు ప్రభుత్వం తగ్గించిందని, దీనివల్ల సామాన్యులకు అవసరమయ్యే వస్తు, సేవలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. ఈ ఫలాలను వినియోగదారులకు అందించే ఉద్దేశ్యంతో విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా సోమవారం మహారాజా డిగ్రీ కళాశాలలో సెమినార్‌ను నిర్వహించామని, బైక్ ర్యాలీ అనంతరం మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో స్వదేశీ మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు. జిఎస్‌టిపై అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా, జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సూపర్ జిఎస్‌టి-సూపర్‌సేవింగ్స్ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కోటవద్ద జిల్లాపరిషత్ సిఈఓ బివి సత్యనారాయణ జెండాఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్మికశాఖ డిసిఎల్ ప్రసాదరావు మాట్లాడుతూ, జిఎస్‌టిపై అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీలను నిర్వహించినట్లు తెలిపారు. తగ్గించిన జిఎస్‌టిపై ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. దీనివల్ల వస్తుసేవల ధరలు తగ్గి, చాలావరకు ప్రజలకు ఆదా అవుతుందని అన్నారు. ఈ తగ్గిన మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు. జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలను ప్రజలకు అందించేందుకు చైతన్య కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మి, ఏసిటిఓలు, కార్మికశాఖ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది మా ప్రభుత్వం ....

- ఎమ్మెల్యే కళావెంకటరావు

విశాలాంధ్ర చీపురుపల్లి : రాష్ట్రంలో గల ఓటమి ప్రభుత్వము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని చీపురువల్లి శాసనసభ్యుడు మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఇప్పుడు అలా వెంకటరావు అన్నారు.. చీపురుపల్లి,గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలంలోని ఉన్న ప్రభుత్వ పాఠశాలల వద్ద మెగా డీఎస్సీ లో ఉత్తీర్ణత సాధించి పోస్టింగ్ అందుకున్న ఉపాధ్యాయులందరూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు అని కిమిడి అన్నారు... రాష్ట్ర చరిత్రలోనే మెగా డీఎస్సీ ద్వారా, అతి తక్కువ రోజుల్లో, అతి ఎక్కువ టీచర్ పోస్టులు తీసిన నిరుద్యోగులకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు కి , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి, కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు నూతనముగా నియమింపబడిన ఉపాధ్యాయులు కృతజ్ఞతా భావాన్ని తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.మెగా డీఎస్సీలో ఎంపికై నియామక పత్రాలు అందుకుని ఈరోజు జాయిన్ అయిన చీపురుపల్లి నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాల ఉపాధ్యాయులకు చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళా వెంకటరావు రాష్ట్ర కార్యదర్శి, యువనాయకులు కిమిడి రామ మల్లిక్ నాయుడు లు శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వ హణలో బాధ్యతగా ఉండాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కళావెంకటరావు నూతన ఉపాధ్యాయులకు సూచిస్తున్నట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారని,నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేశారని యువనేత రామ మల్లిక్ నాయుడు అన్నారు,ఇచ్చిన మాట ప్రకారం 16,347 మంది కొత్త ఉపాధ్యాయులను తీసుకొచ్చామని,మా యువనాయకులు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పాఠశాలల్లో ఇక నుంచి ఉపాధ్యాయుల కొరత ఉండదని చెప్పారురానున్న రోజుల్లో మరికొన్ని డీఎస్సీ నోటిఫికేషన్లు చూస్తారని పేర్కొన్నారు.

చింతపల్లిపేట యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి గ్రామంలో విషాదం

విశాలాంధ్ర గరివిడి: బీగుర్ల మండలం చింతపల్లిపేట గ్రామానికి చెందిన చింతపల్లి పవన్ (22) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఆదివారం అర్ధరాత్రి 12బీ30 సమయంలో చీపురుపల్లి రైల్వే స్టేషన్ నుండి తన స్నేహితుడు చింతపల్లి రాజేష్‌ను దింపి, తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. పవన్‌తో పాటు అతని స్నేహితుడు కనిమేరక శ్రీను బైక్‌పై ప్రయాణిస్తుండగా గరివిడి వాటర్ ట్యాంకర్ సమీపంలోని ప్రధాన రహదారిపై బండి అదుపు తప్పి బోల్తాపడింది.ఈ ప్రమాదంలో పవన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్ర వాహనం కనిమేరక శ్రీను నడుపుతుండగా, పవన్ వెనుక కూర్చున్నట్లు సమాచారం.మృతుడు చింతపల్లిపేట గ్రామానికి చెందిన చింతపల్లి నాగరాజు, గౌరీ దంపతుల రెండో కుమారుడు. పవన్ స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉన్నాడు. అతని అకాల మరణంతో తల్లిదండ్రులు, సోదరులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. పవన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గరివిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టిటుకున్న స్వప్న హైందవి భక్తి సంగీత కచేరీ

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా విజయనగరం చదురుగుడి వద్ద భక్తి మయ వాతావరణం నెలకొంది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, శ్రీమాన్ వంగిపురం రామానుజాచార్య పురస్కార గ్రహీత డా. పెన్నేటి స్వప్న హైందవి ఆధ్వర్యంలో భక్తి సంగీత కచేరీ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా డా. స్వప్న హైందవి భక్తి పారవశ్యంగా పైడిమాంబ స్తుతి, నామావళి పాటలతో పాటు "జయలక్ష్మీ, వరలక్ష్మీ, హరినామముకదు ఆనందమయం" అంటూ అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించి భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు.కచేరీకి హెచ్. రామ్ చరణ్ వయొలిన్‌పై, మండపాక రవి మృదంగంపై వాద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి సంగీతాన్ని ఆస్వాదించారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చట్టపరిధిలో చర్యలు

- ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్,సోమవారం జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించారు.ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 40 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయాఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 8, కుటుంబ కలహాలకు సంబంధించినవి 5, మోసాలకు పాల్పడినట్లు 4,నగదు వ్యవహారాలకు సంబంధించి 1, ఇతర అంశాలకు సంబంధించినవి 22 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలనుగుర్తించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐప్రభావతి సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్మూలించాలి

-నకిలీ మద్య సూత్రధారులను కఠినంగా శిక్షించాలి
-రాష్ట్ర వైసీపీ మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నకిలీ మద్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్మూలించాలని, ఈ నకిలీ మద్య సూత్రధారులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వైఎస్సీపీ మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో వర్షంలోనే మహిళలంతా పట్టణంలో పలు ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం అన్ని జిల్లాలలో నకిలీ మద్యంపై మహిళలంతా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నకిలీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా నిర్మూలించాలని, పర్మిట్రూమ్స్, బార్స్, బెల్ట్ షాప్స్ లో విక్రయిం చబడిన నకిలీ మద్యం ని గుర్తించి వెంటనే బ్యాన్ చేయాల న్నారు. దీని వేనక ఎంత పెద్ద వాళ్ళు ఉన్న సరే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విజయనగరం నియోజకవర్గ కార్పొరేటర్స్, ఇతర మహిళలతో ఎక్సైజ్ శాఖ సీఐ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ ప్రెసిడెంట్ గదుల సత్యలత, విజయనగరం ప్రెసిడెంట్ పిన్నింటి కళావతి, కార్పొరేటర్స్ సంతోషి,పద్మావతి, దుప్పాడ సునీత, పట్టా ఆదిలక్ష్మి, బోనుల ధనలక్ష్మి, దాసరి సత్యవతి, రేగాన రూప దేవి, నాగవల్లి, ఇతర పార్టీ కార్యకర్తలు తదితరులూ పాల్గొన్నారు.

నడక మైదానానికి పేరు పెట్టి, వ్యాయామ పరికరాలు ఏర్పాటు

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: విజయనగరం 42వ డివిజన్ పరిధిలోని కామాక్షినగర్-అయ్యన్నపేట జంక్షన్ వద్ద కరెంట్ ఆఫీస్ సమీపంలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానానికి పేరు పెట్టి, క్రీడా మరియు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ వినతిని సామాజికవేత్త, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు) సోమవారం ఉదయం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ గ్రీవెన్స్ సమావేశంలో కమిషనర్‌కు అందజేశారు. రామకృష్ణారావు మాట్లాడుతూ, 42వ డివిజన్ పరిధిలోని ఈ మైదానంలో ప్రతిరోజూ అనేకమంది స్థానిక ప్రజలు నడక, వ్యాయామం చేస్తున్నారని తెలిపారు. అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ మరియు శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ సభ్యులు తరచూ వైద్య శిబిరాలు, శ్రమదాన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు.పిల్లలకు క్రీడా పరికరాలు, యువతకు వ్యాయామ పరికరా లు ఏర్పాటు చేసే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే మైదానానికి తోషిని వాల్, ఆల్వార్ దాస్ లేదా విజయనగరానికి విద్యాధానం చేసిన పీ.వీ.జీ.రాజు పేరు పెట్టాలని సూచించారు

జి.ఎస్.టి 2.0 తో సామాన్యులకు ఊరట : ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-శృంగవరపుకోట: జి.ఎస్.టి 2.0 తో సామాన్యులకు ఊరట కలగనుందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో గల స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జి ఎస్ టి 2.0 పై ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. జీఎస్టీ చట్టంలో 2% పన్ను సంస్కరణల ద్వారా ఇటీవల అమలులోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపుల ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గాయని తెలిపారు. ఈ పన్ను రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర జీఎస్టీ శాఖ, పరిశ్రమల శాఖ మరియు సమాచార సాంకేతికపరిజ్ఞానం శాఖ సహకారంతో ఒక ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జీఎస్టీ మార్పులపై స్పష్టమైన అవగాహన, ధరల పారదర్శకత మరియు వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో ప్రజలకు అవగాహన ఇస్తూ పాత పద్ధతిలో కొనుగోలు కాకుండా కొత్త పద్ధతిలో కొనుగోలు అయ్యే విధంగా అమలు చేయాలని సూచనలు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీని ఆమె ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, స్పెషల్ ఆఫీసర్ మురళి కృష్ణ,జీఎస్టీ ఆఫీసర్ రాము, శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్,మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న,ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామ సత్యం,టౌన్ పార్టీ అధ్యక్షులు నానిగిరి రామనాజీ, జెడ్పిటీసీ అభ్యర్థి బీశెట్టి అరుణ,సర్పంచులు గనివాడ సన్యాసి నాయుడు,మహేష్,ఐటీడీపీ అనకాపల్లి చెల్లయ్య,పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు సాయి రాం,బీజేపీ నాయకులు డీ.సూర్యారావు, జనసేన నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు, మరియు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను అందరూ వినియోగించుకోవాలి

- సూపర్వైజర్ అనురాధ

విశాలాంధ్ర-గంట్యాడ: అంగన్వాడి కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య కు మూడు నుంచి ఐదు సంవత్సరాలు పిల్లలందరూ హాజరు కావాలని సూపర్వైజర్ అనురాధ తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగముగా బుడతనా పల్లి 2వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా సూపర్వైజర్ అనురాధ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మూడు సంవత్సరాలు దాటిన చిన్నారులందరూ ప్రీ స్కూల్స్ విద్యను అభ్యసించాలన్నారు ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ పై అవగాహన కలిగించారు . అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు ఆటపాటల ద్వారా విద్యను నేర్చుకోవడం వల్ల శారీరకంగా మానసికంగా మంచి పెరుగుదల అభివృద్ధి కలుగుతుందని తెలిపారు. పజిల్స్ కథలు కబుర్లు ద్వారా మెదడు చురుగ్గా పనిచేయడం తద్వారా పిల్లలు ఉత్సాహవంతంగా ఉంటారన్నారు. బుడతనాపల్లి మహిళా సంరక్షణ కార్యదర్శి సుధారాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాట్ల ద్వారా విద్యనందిస్తూ అందిస్తూ రోజుకు ఒక మెనూ పెట్టి మంచి పౌష్టికాహారాన్ని కూడా అప్పటికప్పుడు తయారుచేసి పెడతారని తప్పనిసరిగా అందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణమ్మ, మదీనా రాజేశ్వరి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

- విజయనగరం ఇంచార్జ్ డిఎస్పీ గోవిందరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం సబ్ డివిజనులో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్ 30 పోలీసు చట్టంను అక్టోబరు 13 నుండి నవంబరు 11 వరకు అమలు చేస్తున్నామని విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిజయనగరం సబ్ డివిజను పరిధిలో సెక్షను 30 పోలీసు చట్టం అమలులో ఉన్నందున పోలీసుశాఖ అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం నిషేదమన్నారు. పోలీసుశాఖ నుండి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని, అందుకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ నడుచుకొని, శాంతియుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసనలు తెలిపేందుకు ముందుగా విజయ నగరం డిఎస్పీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని, అనుమతులు పొందాలన్నారు. కావున, ప్రజలు శాంతియుతంగా వ్యవహరించాలని, ముందస్తు అనుమతులతోనే ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. నిబంధన లను ఉల్లంఘించి ఎవరైనా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా ప్రజలకి నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోండి : భీశెట్టి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లా ప్రజలకి నాణ్యమైన వైద్యం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని కోరారు. సోమవారం కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు అధికంగా ఉన్నాయని స్థానికంగా ఉండే పి.హెచ్ .సి,సీహెచ్ సి,అర్బన్ పి.హెచ్.సి.ఏరియా ఆసుపత్రిల్లో నాణ్యమైన జవాబుదారితో కూడిన వైద్యం ప్రజలకు అందించాలని స్థానికంగా తొలిదశలో రోగాలు గుర్తించడానికి సరైన అవకాశాలు లేక ప్రజలు కొన్ని ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్లి దోపిడీకి గురవుతున్నారని ప్రైవేటు రోగ నిర్ధారణ కేంద్రాలు కూడా రోగులను పట్టి పీడిస్తున్నాయని వీటిపై జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు జిల్లాలో 50 పీ.హెచ్.సి.లు,యూ పిహెచ్ సిలు,18 సీ.హెచ్.సీలు 5,ఏరియా ఆస్పత్రులు 3 ఉండగా ప్రజలు జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చేస్తున్నారని మండల స్థాయిలోనే మౌలిక సదుపాయాలు రోగులకు అందించ గలిగితే రోగులకు ఆర్థిక కష్టాలు ఉండవని అభిప్రాయ పడ్డారు, జిల్లా సర్వజ ఆసుపత్రిలో రోగులు సంఖ్య పెరిగి డాక్టర్లు, సిబ్బంది, తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సర్వజ ఆసుపత్రిని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు తరలించాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డిని కోరామని అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారని భీశెట్టి తెలిపారు, జిల్లాలో ఉన్న ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు రావడం జరిగిందని ఆయన అన్నారు.

వైద్య అధికారులకు మద్దతుగా వైద్య సిబ్బంది నిరసన

విశాలాంధ్ర -భోగాపురం : పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇటీవల తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న వైద్య అధికారులకు మద్దతుగా ఈ నిరసన చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. వైద్యాధికారుల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ వారు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జయకుమారి, పబ్లిక్ హెల్త్ నర్స్ సావిత్రి, హెల్త్ సూపర్వైజర్లు సత్యనారాయణ, బి.కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, స్టాఫ్ నర్సులు ప్రశాంతి, పి.కృష్ణవేణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో కల్తి మద్యం నిరసన కార్యక్రమం

-ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్రంలో నారా వారి కల్తీ ఎన్ బ్రాండ్ మద్యం సీసాలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీ లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కల్తీ మద్యం అరికట్టాలి,కల్తీ మద్యం సీఎం డౌన్ డౌన్, నారా వారి సారా అరికట్టాలి అంటూ నినాదాలు, కూటమి ప్రభుత్వ నేతల్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి చంద్రబాబు నాయుడు గారు మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన మీరు, ఇప్పుడు నకిలీ లిక్కర్ వ్యవహారంలోనూ రాష్ట్రాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నట్టున్నారు.ములకలచెరువులో మీ పార్టీ నాయకులు ఏకంగా కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీయే పెట్టి సప్లై చేసిన ఘటన రాష్ట్రంలో మద్యం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్రానికి సంపద పెరగడం సంగతేమోకాని,లిక్కర్ సిండికేట్లతో,నకిలీ మద్యం తయారీల ద్వారా,ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మీ పార్టీనాయకులు గడించిన అక్రమ సంపాదనను పైనుంచికిందివరకూవీరంతా పంచుకుంటున్నారు. వ్యవస్థీకృతంగాఈ దందా కొనసాగుతోందని చెప్పారు. లిక్కర్ సిండికేట్లకు, గ్రామస్థాయి వరకూ విస్తరించిన బెల్టుషాపుల మాఫియాలకు,కల్తీ మద్యం వ్యాపారానికి అడ్డురాకూడదనే ఉద్దేశంతోనే ఒక వ్యూహం ప్రకారం మీరు ప్రభుత్వ మద్యం దుకాణాలపై విష ప్రచారం చేశారని,ఉద్దేశ పూర్వకంగా వాటిని తీసివేసి,వాటి స్థానంలో మీ సిండికేట్లకు అప్పగించారు.మద్యం దుకాణాలు టీడీపీ వాళ్లవే, బెల్టుషాపులు టీడీపీ వాళ్లవే ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు టీడీపీ వాళ్లవే, అక్రమ మద్యం తయారీ దారులు కూడా టీడీపీ నేతలే. వాళ్లు తయారుచేస్తారు,ఆ తయారు చేసిన దాన్ని మీ వాళ్లే, మీ షాపులద్వారా,మీ బెల్టుషాపుల ద్వారా అమ్ముతారు అలా వచ్చిన డబ్బును వాటాలు వేసుకుని దోచుకుంటున్నారు. అని పేర్కొన్నారు.

మహిళల రక్షణ కొరకు శక్తి యాప్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఎం.భబిత

అన్ని కోర్టులలో ఉన్న మహిళా సిబ్బందికి వారి రక్షణ, భద్రతకై న్యాయ అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం, కంటోన్మెంట్ : సోమవారం నాడు జిల్లా కోర్టు పరిధిలో ఉన్న అన్ని కోర్టులలో ఉన్న మహిళా సిబ్బందికి వారి యొక్క రక్షణ కొరకు భద్రత కొరకు న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఎం.భబిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారు అన్ని కోర్టులలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తి ఆప్ ను వారి యొక్క మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ తప్పనిసరిగా చేసుకోవాలని,ఈ యాప్ ద్వారా మహిళలు ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అత్యవసర రక్షణ, సహాయము కావలసిన ఎడల ఈ యాప్ వినియోగించినా వారికి పోలీస్ శాఖ ద్వారా రక్షణ త్వరితగతిన అందుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్ ను వారి యొక్క మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని వినియోగించాలని తెలియజేశారు. విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కే.నరసింహమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శిరీష, కోర్టు సిబ్బందికి శక్తి యాప్ ను ఏ విధంగా డౌన్లోడ్ చేసుకోవాలో దాన్ని ఏ విధంగా ఉపయోగించాలో తెలిపారు . మహిళల రక్షణ కొరకు శక్తి యాప్ ను ఈ క్రింది విధంగా డౌన్లోడ్ చేసుకోవాలి

ముందుగా మొబైల్ ఫోన్లో ఉన్న ప్లే స్టోర్ లోకి వెళ్లి శక్తి యాప్ అని టైప్ చేస్తే యాప్ డౌన్లోడ్ అవుతుంది అన్ని అన్నారు.తర్వాత మీ ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటిపి వస్తుంది అది ఎంటర్ చేసిన తరువాత వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకోవాలి.అదేవిధంగా బాల బాలికలు మిస్సింగ్ అయినా ఈ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చు. మిస్సయిన బాలబాలికను గుర్తించడానికి యాప్ ఉపయోగపడుతుందని తెలియజేశారు. ..

బంగార్రాజును కలసిన గరి వెంకటరమణ

విశాలాంధ్ర-భోగాపురం: పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గరి వెంకటరమణ (సూర్యతేజ) సోమ వారం ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ చైర్మన్ మరియు నెల్లిమర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కర్రోతు బంగార్రాజుని మర్యాద పూర్వకంగాకలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ తన నియామకంపై పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

కొత్త బ్రాంచ్‌ని ప్రారంభించిన కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ హెడ్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-కశింకోట: మండలకేంద్రమైన కశింకోట గ్రామంలో సోమవారం కెనరా బ్యాంక్ కశింకోట బ్రాంచ్ ను విజయవాడ సర్కిల్ హెడ్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందరరేగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు స్వయం శక్తి సంఘ సభ్యులకు విద్యార్థులకు అవసరమైన రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ ృహ రుణాలు బ్యాంకు మరిన్ని ప్రభుత్వ సేవలు అందించేందుకు ఈ బ్యాంకు సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కశింకోట శాఖ మేనేజర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కెనరా బ్యాంక్ ఏజీఎం మధుసూదన్ రెడ్డి, కశింకోట బ్రాంచ్ మేనేజర్ మురళీక ృష?, ప్రముఖ వ్యాపారి కోలాటి నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు ఎస్ ఆర్ లు పంపిణీ చేసిన ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-యస్ .రాయవరం : ఇటీవల కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు మండలంలోని 35 మందికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్ట్(ఎస్ ఆర్)లను అందజేయడం జరిగింది. పాఠశాలలో విధుల్లో చేరిన ఉపాధ్యాయులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రీ ధర్మారావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని నూతన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయడంతో పాటు పాఠశాల ప్రతిష్టలను పెంచాలని ఆకాంక్షించారు తమ సంఘములో సభ్యత్వం తీసుకొని సంఘం అభివృద్ధికి పాటుపడాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి శ్రీనివాస్, సంఘం నాయకులు పత్తి ప్రసాద్, సాదిక్, వీసం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై

రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-గంట్యాడ : మండలంలో పంట కొత ప్రయోగాలపై రైతు సేవా కేంద్రము సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి కళాజాత సభ్యులు వారి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరిగింది.పంట కోత ప్రయోగాలపై రెవిన్యూ డివిజన్ విజయనగరం నుండి వచ్చిన డే. సో రామచంద్ర రైతు సేవ కేంద్రం సిబ్బందికి ఏ విధంగా ప్లాట్ ను గుర్తించాలి, ప్లాట్ ఏ విధంగా 5%ఇ%5 సైజు గుర్తించి మార్కింగ్ చేయాలి, మొదలగు విషయాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.పంటకోత ప్రయోగాల వలన పంటలు నష్టం వాటిల్లినప్పుడు ఇన్సూరెన్స్ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది, అదేవిధంగా జీడీపీ జిడిపిలో కూడా వ్యవసాయ రంగం యొక్క వాటాను లెక్కించడానికి ఉపయోగపడుతుంది. అని వారికి వివరించడం జరిగింది.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి%శ్రీ%శ్యామ్ తో పాటు, మండల ఏ ఎస్ ఓ రాజేశ్వరి ఏ ఈ ఓ స్ హైమావతి, సునీల్, పాల్గొన్నారు. అదేవిధంగా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ నుండి వచ్చిన గోపి రాజు మరియు వారి సిబ్బంది ఇన్సూరెన్స్ పథకం గురించి ఆర్ ఎస్ కె స్టాఫ్ కు వివరించడం జరిగింది..